





నడక అదిరే.. అందం మురిసే

కాకతీయ వైద్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 'ఉత్కర్ష-24' కార్యక్రమాల్లో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన ఫ్యాషన్ షో అలరింపజేసింది. వైద్య విద్యార్థులు ప్రత్యేక వేషధారణలతో ఆకట్టుకున్నారు. జంటగా, బృందాలుగా ఇచ్చిన ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. డీజే పాటలకు నృత్యాలు చేశారు. –న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

ఈనాడు హనుమకొండ

శుక్రవారం సెప్టెంబరు 27, 2024

నేడు ప్రపంచ పర్యాటక ఉత్సవాలు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. 'పర్యాటకం - శాంతి' అనే అంశంపై ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యాటకంపై అవగాహన కల్పించడానికి పాఠశాల నుంచి ఉన్నత విద్యాస్థాయిలో ఏకో టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేశామని, మరిన్ని విద్యాసంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాయన్నారు.

హరిత హోటల్‌లో ఫుడ్ ఫెస్టివల్..

శుక్రవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఫుడ్ ఫెస్టివల్‌తో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పర్యాటక అధికారి శివాజీ తెలిపారు. పర్యాటక రంగంపై అవగాహన కోసం పాఠశాల విద్యార్థులకు హెరిటేజ్ వాక్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. హరిత హోటల్‌లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

16 నుంచి న్యాయ విద్య పరీక్షలు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని న్యాయ విద్య (ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం) సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను గురువారం కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహాచారి, అదనపు అధికారి బీఎస్ఎల్ సౌజన్య విడుదల చేసారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

నలుదిశలా.. ఘనకీర్తి చాటేలా!

- పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు..
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం..

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి, ఈనాడు వరంగల్



పర్యాటక ప్రాంతాల్లో అపరిశుభ్రత, ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకు పోతుండటం ప్రకృతి ప్రేమికులకు ఆందోళన కలిగిస్తోంది. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో గురువారం 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. యువత, వాకర్స్, విద్యార్థుల సహకారంతో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించింది. విద్యార్థులు కట్టడాల ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ.. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యాటక ప్రాంతాలను కాపాడుకుంటామని ప్రతినబూనారు.



ప్రకృతిహితం

ఖిలావరంగల్, వరంగల్ జిల్లా

- **కార్యక్రమం:** పర్యాటక ప్రాంతాలు కాలుష్యమయం కాకుండా ఉండేందుకు ప్రకృతిహితంగా సైకిల్‌పై వెళ్లి సందర్శించడం, సమీపంలో ఉంటే నడక ద్వారా వెళ్లి చూడటం. సైక్లిస్టులు ఉదయం 6 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ముందు సైక్లింగ్ ప్రారంభించి, సుమారు 15 కి.మీ. దూరంలోని వరంగల్ కోటకు చేరుకున్నారు. ఈ ప్రదేశంలో సైకిల్‌పై తిరుగుతూ కీర్తి తోరణాలు, ఖుష్ మహల్ ఇతర ప్రదేశాలను సందర్శించారు. అనంతరం వాకర్స్‌తో కలిసి రాతి గోడ వరకు నడుస్తూ పర్యాటక ప్రాంతాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం కట్టడికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు.
- **పాల్గొన్న వారు:** ట్రైసిటీ రైడర్స్ వరంగల్ అసోసియేషన్ సభ్యులు జయరాజ్, విద్యాసాగర్, ప్రసాద్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సదాశివరెడ్డి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, సైక్లిస్టులు, ఖిలా వరంగల్‌లోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 60 మంది
- **సందేశం:** కాలుష్యం బారి నుంచి పర్యాటక ప్రాంతాలకు విముక్తి



అవగాహన

ఇనుగుర్తిలోని కాకతీయుల శిలా శాసనాలు: మహబూబాబాద్ ● కాకతీయులు నిర్మించిన శాసనాలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన ● జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.యాకయ్య, బి. దేవేందర్ ● భావితరాలకు కాకతీయుల శిలా శాసనాలను అందించాలి. - ఇనుగుర్తి (కేసముద్రం)



శ్రమదానం

కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● కాళేశ్వరం హరిత హోటల్ సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించడం ● హరితా సిబ్బంది, మేనేజర్ జక్కం సురేష్ ● శ్రమదానం చేద్దాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. – కాళేశ్వరం





చైతన్యం

శ్రీ వేంకటేశ్వర స్వామి సమేత పద్మావతి, అలివేలుమంగమ్మ ఆలయం మహబూబాబాద్ జిల్లా ● ఆలయ విశిష్టతపై ఇంటర్మీడియట్ విద్యార్థినులకు అవగాహన ● ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె. శేఖర్, ఎస్సై మాలోతు సురేష్, ఆలయ అర్చకులు నందనాచార్యులు, రాంబాబుచార్యులు, ఎంపీవో యాకయ్య ● ఆలయాలు, పర్యాటక ప్రాంతాలపై అవగాహన అవసరం – నర్సింహులపేట (డోర్నకల్)



స్వచ్ఛత

పాండవుల గుట్టలు రేగొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● పాండవుల గుట్టల్లో, గుట్టల కింద భాగంలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు ● గ్రామస్థులు, యువకులు ● పాండవుల గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుంది. సందర్శనకొచ్చే వారు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి. – రేగొండ



బాధ్యత

రామప్ప ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు ● పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానికులు ● రామప్ప పరిసరాలు శుభ్రత సామాజిక బాధ్యత – వెంకటాపూర్



పరిశుభ్రత

బొగత జలపాతం ములుగు జిల్లా ● పిల్లల పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు ● అటవీ, జలపాతం రక్షణ సిబ్బంది ● స్వచ్ఛత పాటిద్దాం, పచ్చదనం పెంచుదాం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి భద్రత – వాజేడు



ప్లాస్టిక్‌పై యుద్ధం

లక్నవరం జలాశయం, ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ● బుస్సాపూర్ మాజీ ఉప సర్పంచి బేతి దేవేందర్‌రెడ్డి, పీపీఎస్ డైరెక్టర్ పాశం మాధవరెడ్డి, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది ● పర్యావరణాన్ని రక్షిస్తే మనల్ని మనం కాపాడుకున్నట్లే.. భావితరాలకు బతుకునిచ్చినట్లే. – గోవిందరావుపేట

ములుకనూరు సహకార సంఘానికి 68 ఏళ్లు

- నేడు వార్షిక మహాసభ



ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘ కేంద్ర కార్యాలయం

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కొనసాగుతున్న ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం ఏర్పడి 68 సంవత్సరాలు అయింది. శుక్రవారం వార్షిక మహాసభ నిర్వహించనున్నారు. రైతు తన పొలంలో విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికందే వరకు సంఘం వెన్నుదన్నుగా నిలుస్తోంది. విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించడంతోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలిచింది. 14 గ్రామాల్లో 7641 మంది రైతుల సమష్టి సహకారంతో రూ.394 కోట్ల వ్యాపారంతో సంఘం ముందుకు సాగుతోంది. ఈ ఏడాది రూ.7.07కోట్ల లాభాలు గడించి, మిగతా సహకార సంఘాలకు ఆదర్శంగా నిలిచింది. సభ్యులు పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు 45వేల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గిడ్డంగులు ఉన్నాయి. రైతులకు రుణాలు అందించడంతో పాటు సభ్యుల పిల్లలు సాంకేతిక విద్యను అభ్యసించేందుకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తూ ఉన్నత విద్యకు అండగా నిలుస్తోంది. సంఘంలో 30 ఏళ్ల సభ్యత్వం కలిగిన సీనియర్ సభ్యులను గౌరవించాలనే ఉద్దేశంతో ఏకేవీఆర్ పింఛన్ పథకాన్ని ప్రారంభించి ప్రతి నెలా రూ.800 చొప్పున అందిస్తున్నారు. సంఘం బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వార్షిక మహాసభ ఈ నెల 27న ఉదయం 11గంటలకు బ్యాంకు పారా బాయిల్డ్ రైసుమిల్లు ఆవరణంలో ఉంటుందని సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. సభ్యులందరూ బ్యాంకు పాసుపుస్తకంతో హాజరుకావాలని కోరారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



ఐలమ్మ కాంస్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఎంపీ కావ్య,, కలెక్టర్లు ప్రావిణ్య, సత్యశారద

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: భూమి, భుక్తి, విముక్తి కోసం నిజాం నవాబు, రజాకార్లపై చాకలి ఐలమ్మ చేసిన సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఐలమ్మ జయంతి సందర్భంగా 31వ డివిజన్ న్యూశాయంపేటలో ఆమె కాంస్య విగ్రహానికి ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావిణ్య, సత్యశారదతో కలిసి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం వచ్చాక ఐలమ్మ సేవలకు గౌరవంగా హైదరాబాద్‌లోని కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి ఆమె పేరు పెట్టామన్నారు. రజక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. 55 మంది నుంచి సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, శిబిరం అధ్యక్షుడు వల్లెంగుల కొంరెల్లి, నాయకులు నూతనకంటి బాబు, పతంగి సమ్మయ్య, సత్తు సోమయ్య, రాజేందర్, సదానందం, చిట్యాల భిక్షపతి, రాములు, సాంబయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఈనాడు కథనానికి స్పందన

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: నగరంలో సమయపాలన పాటించకుండా దుకాణాలు తెరిచి మద్యం విక్రయిస్తున్నారు. మందు బాబులు రోడ్లపైనే మద్యం తాగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వైనంపై 'కోడి కూయకముందే మద్యం జోరు' శీర్షికన ఈనాడులో బుధవారం ప్రచురించిన కథనానికి వరంగల్ కమిషనరేట్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గురువారం వేకువ జామునుంచే టాస్క్‌ఫోర్స్ పోలీసులు మద్యం దుకాణాలపై దాడులు నిర్వహించారు. సమయ పాలన పాటించకుండా డబ్బాల జంక్షన్ వద్ద ఉదయం 5.30 గంటలకు తెరిచి మద్యం విక్రయిస్తున్న శ్రీరామ బార్ అండ్ రెస్టారెంట్‌లో దాడులు చేసి రూ.3,890 విలువ చేసే మద్యం, రూ.3,650 నగదు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు, విచారణ కోసం హనుమకొండ రాణా పోలీసులకు అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, ఎస్సై శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్తల అవసరం ఉంది



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఐఏబీ డైరెక్టర్ రీతూశర్మ

విద్యానగర్, న్యూస్‌టుడే: బయోటెక్నాలజీలో యువ శాస్త్రవేత్తల అవసరం ఉందని ఎన్ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ రీతూశర్మ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎనిమల్ సైన్సెస్' అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సులో గురువారం ఆమె ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా బయోటెక్నాలజీ రంగానికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. 12 విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధకులు పాల్గొని, 50కి పైగా వివరణ పత్రాలు సమర్పించారు. యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి, విభాగ ఆచార్యులు శమిత, వెంకయ్య, నారాయణ, సహ ఆచార్యులు ఇస్తారి, ఫాతిమా, సుజాత పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటాం



కార్మికులకు కిట్లు అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర శుభ్రత కోసం పాటుపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటామని, వారి ఆరోగ్య రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో గురువారం బల్దియా ఇండోర్ స్టేడియంలో పారిశుద్ధ్య కార్మికులు, సెప్టిక్ ట్యాంకు ఆపరేటర్లకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రేటర్‌లో ఎక్కువ మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వారు క్యాన్సర్ బారిన పడకుండా నిరంతరం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ డా.అశ్విని తానాజీ, కార్పొరేటర్లు తోట వెంకన్న, రవీందర్, సీఎంహెచ్‌వో డా.రాజేష్, టీపీఆర్వో రాజేష్, డీఎఫ్ఓ శంకరలింగం, బయాలజిస్టు మాధవరెడ్డి, వైద్యులు డా.అవినాష్ తిప్పని, రాహుల్ నారాయణ్, సుచిత్ర తిప్పని, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు.. అక్షరాలు దిద్దించారు!




చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ ప్రావిణ్య, డీఈవో వాసంతి తదితరులు

ఐనవోలు, న్యూస్‌టుడే: అధికారులు ఉపాధ్యాయులుగా మారారు. చిన్నారులచే అక్షరాలు దిద్దించారు. వారి చదువుల పట్ల తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కలెక్టర్ ప్రావిణ్య, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి గురువారం ఐనవోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని సందర్శించారు. పాఠశాల ఆవరణలోని వంట గది, డైనింగ్ హాల్, సరకులు భద్రపరిచే గదులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసన చేయించారు. గర్భిణిలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి ఎంఈవో ఆనందం, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘుపతిరెడ్డి, ఏపీవో కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయలోపం.. నగర ప్రజలకు శాపం

- కుడా, గ్రేటర్ మధ్య బృహత్ ప్రణాళిక వివాదం




వరంగల్ నూతన మాస్టర్ ప్లాన్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా), గ్రేటర్ వరంగల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో వరంగల్ నగర ప్రజలు భవన నిర్మాణ అనుమతుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదేళ్లుగా 2041- వరంగల్ నూతన బృహత్ ప్రణాళిక(మాస్టర్‌ప్లాన్) అమలు చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా.. కొత్త మాస్టర్ ప్లాన్ సమగ్ర మ్యాపు, జోన్ల వివరాలు 'కుడా' ప్రణాళిక విభాగం అధికారులు గ్రేటర్‌కు ఇవ్వడం లేదని తెలిసింది. పూర్తి సమాచారం తెలియక పోవడంతో బల్దియా పట్టణ ప్రణాళిక విభాగం భవన నిర్మాణ అనుమతులు(బిల్డింగ్ పర్మిషన్లు) ఆపేస్తున్నారు. ఏమిటని అడిగితే నూతన మాస్టర్ ప్లాన్ వివరాలు సరిగాలేవంటున్నారు. ఏడాదిన్నరగా ఈ వివాదం నెలకొంది. గ్రేటర్ కమిషనర్‌గా, 'కుడా' వైస్ ఛైర్మన్‌గా డాక్టర్ అశ్విని తానాజీ ఉన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని నగర ప్రజలు కోరుతున్నారు.

వందలాది దస్త్రాలు పెండింగ్

- 'కుడా' రూపొందించిన 2041- బృహత్ ప్రణాళిక ఆది నుంచి వివాదాస్పదమవుతోంది. 2018లో ముసాయిదా విడుదలైంది. 2019లో 'కుడా' పాలక మండలి ఆమోదం తెలిపి, తెలంగాణ రాష్ట్ర పురపాలక శాఖకు పంపించింది. 2021లో మార్చిలో అప్పటి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదంతో కొత్త మాస్టర్ ప్లాన్‌లో అమలులోకి వచ్చింది. రెండేళ్లపాటు గెజిట్ ప్రకటన(నోటిఫికేషన్) జాప్యమై చివరగా 2023 ఆగస్టులో రాజపత్రంలో పెట్టారు. అధికారికంగా ఆమోదం లభించినా.. ఇంత వరకు 'కుడా' ప్రణాళిక విభాగం అధికారులు మాస్టర్ ప్లాన్ సమగ్ర వివరాలు ఇవ్వడం లేదనే విమర్శలున్నాయి.
- 2016లో ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పొందిన వారికి గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ విభాగం భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే 2041- మాస్టర్ ప్లాన్ వివరాలు లేవని తప్పించుకుంటున్నారు. ల్యాండ్ యూసెజ్, జోన్ల వివరాలు తెలియడం లేదంటున్నారు. దీంతో భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సాధారణ, మధ్య తరగతి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

చెరువులోనే భవనం..!



● ధర్మసాగర్ జలాశయంలో ఏడాదిగా పనులు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములు కబ్జాకు గురవుతుండగా, తాజాగా నిర్మాణాలు ప్రారంభించారు.

ఈనాడు, వరంగల్, ధర్మసాగర్, న్యూస్‌టుడే

రాజధాని హైదరాబాద్‌లోని చెరువు శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే 'హైడ్రా' కూల్చేస్తోంది. కొత్తగా వెలుస్తున్న నిర్మాణాలపై కొరడా ఝుళిపిస్తోంది. మన దగ్గర ఏకంగా జలాశయంలోనే భవనం నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

దేవాదుల ఎత్తిపోతల పథకానికి గుండెకాయ లాంటి ధర్మసాగర్ జలాశయం గ్రేటర్ వరంగల్ ప్రజల తాగునీటికి ప్రధాన వనరు. ఈ చెరువు శిఖంలోనే ఒక భవనాన్ని కట్టేశారు. ధర్మసాగర్ నుంచి ముప్పారం దారిలో ఉన్న జలాశయం శిఖం భూమిలో ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని ఏడాది కాలంగా చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ అడ్డుకోకపోవడం గమనార్హం.

పట్టాభూమైనా అనుమతి లేదు

అనేక గ్రామాల పరిధిలో చెరువు శిఖం భూముల్లో రైతులకు పట్టా భూములు ఉంటాయి. చెరువులో నీళ్లు లేనప్పుడు పంటలు వేసుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ధర్మసాగర్ చెరువు శిఖంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. పట్టాగల భూమి జలాశయంలో ముంపునకు గురికాలేదని, వ్యవసాయ భూమిని 'నాలా' (వ్యవసాయేతర) భూమిగా మార్పిడి చేసుకున్నట్టు సమాచారం. మరో విడ్డూరం ఏంటంటే 'నాలా' కన్వర్షన్ తీసుకున్నది ఒక చోట కాగా.. ఇంటి నిర్మాణం జరిగింది మరో ప్రాంతంలో అని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.

స్థానిక తహసీల్దార్ ఏమన్నారంటే..


ఇది పట్టా భూమి అని, ముంపునకు గురికాలేదని ఆధారాలను చూపించి, ఇందులో ఎలాంటి అభ్యంతరాలు లేవని, ఒకవేళ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని సంబంధిత రైతు డిక్లరేషన్ ఇస్తే నాలా కన్వర్షన్ చేశామని చెప్పారు..

● సంబంధిత యజమానిని 'ఈనాడు' ఫోన్‌లో వివరణ కోరగా ఈ భూమిని రైతు నుంచే కొనుగోలు చేశానని ..శిఖంలో లేదని తెలిపారు.

నోటీసులు జారీ

సాగునీటి పారుదల శాఖ అధికారులు ఇది అక్రమ నిర్మాణమే అని రెవెన్యూ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని అటు అధికారులకు, ఇటు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో సర్వే నెంబర్ 1251లో ఇంటి నిర్మాణం జరుగుతుండగా తమకు గత ఏప్రిల్‌లో సమాచారం రాగా వెళ్లి పరిశీలించామని డీఈఈ ప్రశాంతి తెలిపారు. సంబంధిత యజమానికి నోటీసు ఇచ్చామని చెప్పారు. ఎఫ్‌టీఎల్‌లో లేదని, పట్టా భూమిగా చెబుతున్నారన్నారని.. దీనిపై పూర్తి నిర్ధారణ కోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ కలిసి సర్వే చేయడానికి తహసీల్దార్‌కు ఉత్తరం రాశామని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

● ఇంటి నిర్మాణానికి అనుమతి లేదని, కూల్చివేయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కూడా లేఖ రాశామని పేర్కొన్నారు.



వరంగల్ బస్టాండ్ భవన సముదాయం (పాతచిత్రం)



కూల్చి వేసిన అనంతరం ఇలా..

ఉన్నది కూల్చారు.. నిర్మాణం మరిచారు!

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ప్రస్తుతానికి ఆర్టీసీ బస్టాండ్ లేదు. ఓరుగల్లు రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో రెండున్నర ఎకరాల్లో ఉన్న పాత బస్టాండ్ భవన సముదాయాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో గతేడాది జూన్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ రూ.73.50 కోట్ల అంచనాతో కొత్త ప్రయాణ ప్రాంగణ నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అనంతరం పాత బస్టాండ్ నేలమట్టం చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా.. పనులు ప్రారంభించడం లేదు. పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో ప్రయాణికులు ఎండావానల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే గిర్మాజీపేట

ఎన్‌సీసీ జాతీయ శిక్షణకు ఎంపిక



సాయిచందన్

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల (కే యూసీఈ) బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ బి.సాయిచందన్ జాతీయ శిక్షణకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ ఎన్.రమణ తెలిపారు. సెప్టెంబర్ 26 గురువారం నుంచి అక్టోబర్ 6 వరకు బెంగళూరులో 20 మందికి 'రేడియో కంట్రోలర్ ఇన్ ఏరో మోడలింగ్ డిజైన్'లో శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. శిక్షణకు బయలుదేరిన సాయిచందన్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి రాధిక, ఎన్‌సీసీ అధికారి అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

శాస్త్రీయ పద్ధతుల్లో నేరాల దర్యాప్తు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే నేరాల దర్యాప్తు శాస్త్రీయ పద్ధతుల్లో చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జోన్ల వారీగా కేసుల నమోదు, విచారణ, నిందితుల అరెస్టు, కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి, డయల్ 100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, రౌడీ షీటర్లపై నిఘా పెంచాలని, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. వంతెన పిల్లర్



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ - ఇల్లెందు ప్రధాన రహదారిలో బయ్యారం శివారులోగల పాకాలవాగు వంతెనలోని ఓ పిల్లర్ వద్ద భారీగా మట్టి కోతకు గురైంది. పిల్లర్ చుట్టూ సుమారు 8 అడుగుల లోతు గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వంతెన దిగువ భాగానికి వెళ్తున్న రైతులు పిల్లర్ వద్ద ఏర్పడిన గొయ్యిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ అనిల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పిల్లర్ వద్ద గొయ్యి పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి వంతెన జాతీయ రహదారి పరిధిలో ఉన్నందున సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

– న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)

పర్యావరణ ప్రేమికుడి ఒంటరి పోరాటం

'ఆయన ఒకసారి జాతిపిత గాంధీజీ వేషం వేస్తారు. మరోసారి మెడలో ప్లాస్టిక్ సీసాల దండలు వేసుకొని కనిపిస్తారు. ఇంకోసారి జెండా పట్టుకొని పాదయాత్ర చేస్తూ దారి వెంట వెళ్లేవారందరినీ పలకరిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసమే ఆయన తపనంతా.'



చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, చెరువులను కాలుష్య కాసారాలుగా చేయొద్దని ఒంటరి పోరాటం చేస్తున్నారు హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. వృత్తి రీత్యా ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నా.. ప్రవృత్తి మాత్రం పర్యావరణ పరిరక్షణే. అందుకే ఎక్కడ పర్యావరణ వినాశనం జరుగుతోందని తెలిసినా వెంటనే పాదయాత్రగా బయలుదేరి వెళ్లి దాన్ని ఆపాలంటూ గళమెత్తుతారు. –ఈనాడు, వరంగల్

చెరువుల్లోని వ్యర్థాలను ఏరివేస్తూ..

ప్రకృతిని కాపాడాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకునేవారు, ఫేస్‌బుక్‌లలో పోస్టులు చేసేవారు బోలెడు మంది. ప్రకాశ్ అలా కాదు.. మనం ఆచరించాకే ఇతరులకు చెప్పాలంటారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం అయ్యాక ఓరుగల్లులోని చెరువుల వద్దకు వెళ్లారు. ఒక్కో చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాను తొలగించి గట్టుపై కుప్పలుగా పోశారు. వాటిని తీసుకెళ్లాలని బల్దియా సిబ్బందిని కోరారు. వరంగల్ చిన్నవడ్డెపల్లి చెరువు, హనుమకొండ పద్మాక్షి గుండం, కాజిపేట బంధం చెరువుల వద్దకు వెళ్లి తనకు అందినంత మేర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



ఇటీవల నిమజ్జనం తర్వాత చెరువుల్లోని చెత్తను ఏరివేస్తూ..

● ఈ పర్యావరణ ప్రేమికుడు ప్రతి రెండేళ్లకోసారి మేడారం మహా జాతరకు పాదయాత్రగా వెళతారు. జాతరలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని కాపాడాలనే సందేశం ఇస్తూ నాలుగు రోజుల పాటు వనదేవతల వద్దకు నడక సాగిస్తారు. గత ఫిబ్రవరిలో జరిగిన జాతరకు వినూత్నంగా జాతిపిత గాంధీజీ వేషం ధరించి దారి వెంట కనిపించిన వారిని పలకరిస్తూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందంటూ సందేశం ఇచ్చారు. పాఠశాల పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రయాణం సాగిస్తారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మెడలో ప్లాస్టిక్ సీసాలు ధరించి ప్లాస్టిక్ నిర్మూలనపై వైవిధ్యంగా అవగాహన కల్పించారు.

అలా మొదలు..

ప్రకాశ్ 10వ తరగతి వరకు ములుగు జిల్లా మంగపేటలో చదువుకున్నారు. ఆ సమయంలో బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం బాగా వెలువడడంతో బిల్ట్ యాజమాన్యం అప్పుడప్పుడు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటేది. పాఠశాల స్థాయిలో ఆ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పెద్దయ్యాక అటవీ అధికారి పురుషోత్తంతో పరిచయం అయ్యాక పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరిగింది.

ఒక్కో అడుగు..

● 2018లో ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలని పాదయాత్రగా వెళ్లి ఉత్సవ నిర్వాహకులను, కాలుష్య నియంత్రణ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

● వికారాబాద్ వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం వెయ్యి మర్రిచెట్లను నరికేస్తారని తెలిసి ఓరుగల్లు నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం 'హైదరాబాద్ నేచర్ లవర్స్' సంస్థతో కలిసి చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి వృక్షాల హననాన్ని ఆపాలని ఫిర్యాదు చేయడంతో గ్రీన్ ట్రైబ్యునల్ స్పందించి చెట్ల నరికివేతపై స్టే ఇవ్వడంలో ప్రకాశ్ కృషి కూడా ఎంతో ఉంది.

● ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో దామగుండంలో రాడార్ కేంద్రం ఏర్పాటుపై పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో త్వరలో అక్కడికి పాదయాత్రగా వెళ్లి తన గళాన్ని వినిపిస్తానని చెబుతున్నారు.



ప్రమాదాన్ని మరిచి.. చరవాణిలో నిమగ్నమై



ఇలా చూస్తుంటే అటో.. ఇటో



ఇలా రాజాలా కూర్చుంటే అంతే..

మిత్రమా.. రెప్పపాటులో చేజారుతుంది జీవితం!

రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట అలాంటి హృదయవిదారక దృశ్యాలు వెలుగుచూస్తున్నాయి. అయినా చాలా మంది ప్రయాణికులు రైలు లోపల నిల్చోవడానికి స్థలం ఉన్నా, తలుపు వద్ద కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. అక్కడ ఏ ఆధారం లేకుండా ప్రమాదకరంగా నిల్చుంటారు. చరవాణిలో మాట్లాడుతుంటారు. ఇది రైల్వే చట్టాల ప్రకారం నేరం. రూ.300 జరిమానా లేదా ఏడు రోజుల జైలు శిక్ష ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

గురువారం సాయంత్రం 5 గంటలకు వడ్డెపల్లి చెరువు వద్ద సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లు ఇంటర్‌సిటీని పరిశీలించినప్పుడు ప్రతి కోచ్‌లోనూ ప్రతి తలుపు వద్ద కూర్చుని ఉన్న ప్రయాణికులు కనిపించారు. వడ్డెపల్లి చెరువు వద్ద రైలు గంటకు 30 కి.మీ. వేగంతో ప్రయాణం చేస్తుండగా 'న్యూస్‌టుడే' తీసిన చిత్రాలు ఇవి..

–న్యూస్‌టుడే, కాజీపేట

కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ పోలీసు స్టేషన్ పరిధిలో తలుపు వద్ద కూర్చుని జారి పడి మరణించిన వారి సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2021	13
2022	10
2023	18
2024	12

పదేళ్లలో జరగని అభివృద్ధి.. ఏడాదిలో చేసి చూపిస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలో చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి తనను, తన కుమార్తెను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాటలే కాకుండా దానికి సంబంధించిన ఎజెండాను ప్రకటిస్తున్నట్లుగా వివరించారు. ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అనేక అభివృద్ధి విషయాలపై గంటకు పైగా చర్చించానని చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సమీకృత భవనాల నిర్మాణం, మొదటి దశలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటుగా మున్సిపాలిటీకి సంబంధించిన జీవో, డిగ్రీ కళాశాల ఏర్పాటు, దేవాదుల కాల్వల మరమ్మతులు.. తదితర అభివృద్ధి పనుల గురించి వివరించగా ముఖ్యమంత్రి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అభివృద్ధి పనులకు అక్టోబరు చివరి వారంలో ఉత్తర్వులు వస్తాయన్నారు. వెంటనే పనులకు టెండర్లు పిలిచి.. నవంబరు 15 లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్‌కు తీసుకొచ్చి వేలమంది ప్రజల సమక్షంలో శంకుస్థాపన చేసి.. అదే రోజే ఘన్‌పూర్ మున్సిపాలిటీని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రకటించిన అభివృద్ధి పనులను 2026 జూన్ వరకు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని వెల్లడించారు. గాంధీ భవన్, ఏఐసీసీ చుట్టూ తిరిగేవారికి పదవులు రావని.. ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై.. సమస్యలు పరిష్కరించేవారికే వస్తాయని కడియం శ్రీహరి మార్కుగా.. దానిని ఘన్‌పూర్‌లో అమలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు పొట్లపల్లి శ్రీధర్ రావు, బెలిదె వెంకన్న, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మంచాల ఎల్లయ్య, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొంటాం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తాము సిద్ధంగా ఉన్నామని.. వాటి గురించి తాము ఆందోళన చెందడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందని చెప్పారు. తనకు ప్రజాస్వామ్యం, కోర్టులు, ఎన్నికల వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం ఉందని అన్నారు.. పదేళ్లలో 38 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న నీచ చరిత్ర కలిగిన భారాస ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని.. ఈ జిల్లాకు ఉన్న చరిత్ర, గొప్పతనాన్ని నాశనం చేయకూడదని ఎంత మొత్తుకున్నా తన మాట వినలేదని.. ఆ విషయంలో నేను ఎదురు తిరిగాను కాబట్టే రెండోసారి నాకు మంత్రి పదవి రాలేదని అన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్‌ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండోస్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు



వరంగల్‌లో ఔషధాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ వైద్యమండలి అధికారులు, వరంగల్ యాంటిక్వాకరీ బృందం గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా.. వైద్యం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తెలంగాణ వైద్యమండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వరంగల్ యాంటిక్వాకరీ బృందం, ఐఎంఏ, హెచ్‌ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డా.వద్దిరాజు రాకేష్, డా.అన్వర్‌మియా, డా.వెంకటస్వామి, డా.అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాళ్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేటలో తనిఖీలు చేశారు. పలువురు ఇష్టారాజ్యంగా యాంటిబయాటిక్ ఔషధాలు, నొప్పి నివారణ సూదులు(ఇంజక్షన్లు) ఇస్తున్నట్లు గుర్తించారు. వందల సంఖ్యలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ ఔషధాలు, సూదులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అర్హత లేని వైద్యులపై ఎన్‌ఎంసీ 34, 54 యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు డా.నరేష్‌కుమార్ తెలిపారు. పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకొని వైద్యులు కాకున్నా.. పరిధి దాటి వైద్యం చేస్తున్న మహేందర్, జ్ఞానేశ్వర్‌లపై చర్యలు తీసుకోవాలని బోర్డుకు సిఫార్సు చేయనున్నట్లు వివరించారు.

నర్సంపేట: నర్సంపేటలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లను వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షల యాక్టుకు లోబడి పరీక్షలు చేస్తున్నారా? లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ యంత్రాలు, రోగుల వివరాల పుస్తకాలతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

ఆకట్టుకున్న మేనేజ్‌మెంట్ ఎగ్జిబిషన్


మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి

నయీంనగర్, న్యూస్‌టుడే: హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో గురువారం కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో వాణిజ్యం, నిర్వహణ భావనలపై 'సీమేమ్ ఎక్స్‌పో-2024' నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల సృజనాత్మకతను ప్రదర్శించడమే కాకుండా విద్యా విషయక పరిజ్ఞానం వాస్తవ ప్రపంచ అనువర్తనాలను అన్వేషించడానికి ఇలాంటి వేదికలు దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ఉత్తమ వాటిని ఎంపిక చేసి బహుమతులు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శేషాచలం, వైస్ ప్రిన్సిపల్ పి.హరిందర్‌రెడ్డి, ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు, రేపు పింగిళి డిగ్రీ కళాశాలలో జాతీయ సెమినార్

ఎస్వీఎస్‌కాలనీ, న్యూస్‌టుడే: వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్)లోని చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో '12వ శతాబ్దం నుంచి 20 శతాబ్దం వరకు తెలంగాణ సమాజం, ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి చరిత్ర ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు హాజరై పరిశోధన పత్రాలు సమర్పిస్తారని చెప్పారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య లింబాద్రి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

1న మాదిగల మేలుకొలుపు యాత్ర

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 1న వరంగల్ జిల్లాలో చేపట్టే మేల్కొలుపు యాత్రను జయప్రదం చేయాలని మాదిగ హక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పీఎస్) వ్యవస్థాపకుడు మైస ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాల వారీగా చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో మాదిగ జనాభా గుర్తించి, రిజర్వేషన్లు 12 శాతం కల్పించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో యాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు.

బీసీల రాజ్యాధికార ఉద్యమం ఉద్ధృతం

విద్యానగర్, న్యూస్‌టుడే: బీసీలకు రాజ్యాధికారం కోసం ఉద్యమం ఉద్ధృతం చేయాలని బీసీల రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో వరంగల్ నుంచే ఉద్యమాన్ని తీవ్రతరం చేయనున్నట్లు చెప్పారు. నాయకులు వేణుగోపాల్, బుట్టి శ్యామ్, యుగేందర్, శివ, శేషు, నరేందర్, రామనాథం, చిరంజీవి పాల్గొన్నారు.

రజక సంఘం రక్తదానం

సుబేదారి, న్యూస్‌టుడే: చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సుబేదారి రెడ్‌క్రాస్‌లో రజక ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. వారిని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ అభినందించి, ధ్రువీకరణ పత్రాలు అందించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, పాపిరెడ్డి, సభ్యులు పుల్లూరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధీర వనిత ఐలమ్మ


దామెరలో..


కేయూ పరిపాలన భవనంలో..


సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో..


కమిషనరేట్‌లో చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. పార్టీలు, కుల, ప్రజా, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు నగరంలోని వివిధ కాలనీలు, ప్రధాన కూడళ్లు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళి అర్పించారు. నిజాం నవాబు, రజాకారు సేనలకు వ్యతిరేకంగా సాగించిన పోరును గుర్తు చేసుకున్నారు. ఆమె ధైర్య సాహసాలను శ్లాఘించారు.
- న్యూస్‌టుడే బృందం


ధర్మసాగర్‌లో..


మరిపల్లిగూడెంలో..


సిద్ధార్థనగర్ జంక్షన్ వద్ద..


ములుకనూర్ అంబేడ్కర్ కూడలి వద్ద..


ఆత్మకూరులో..


కాజీపేట బాపూజీనగర్ చౌరస్తాలో..


కేయూ వద్ద బీసీ విద్యార్థి నాయకులు


శాయంపేటలో...

అండర్ పాస్ నిర్మించాలని గ్రామస్థుల దీక్ష


నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారి ఏర్పాటుతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అండర్ పాస్ నిర్మించాలని వల్లభాపూర్ గ్రామస్థులు రిలే దీక్షలు చేపట్టారు. కుటుంబాలు రహదారికి ఇరువైపులా ఉన్నాయని, రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే దండేపల్లి, వీరనారాయణపూర్ గ్రామస్థులు గోపాల్‌పూర్, కమలాపూర్‌కు వెళ్లాంటే ఇబ్బందులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, కుమార్, అయిలయ్య, శ్రీనివాస్, లక్ష్మీతో పాటు పలువురు పాల్గొన్నారు.

మంచి నీటి సహాయకులకు శిక్షణ

కమలాపూర్ : ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నల్లా పైపులు, లీకేజీలు, మరమ్మతుల నిర్వహణపై నల్‌జల్ మిత్ర కింద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈ అనిల్‌కుమార్, ఏఈలు సుభాశ్‌రెడ్డి, కిరణ్, ఎంపీడీవో జి.బాబు, శిక్షకుడు చంద్రశేఖర్, మంచినీటి సరఫరా సహాయకులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ కేసులో ఒకరి అరెస్టు

భీమారం, న్యూస్‌టుడే: క్రిప్టో కరెన్సీ సంస్థ పేరుతో సుమారు రూ.కోటిన్నరకు పైగా ఆన్‌లైన్‌లో మోసగించిన ఘటనలో హసన్‌పర్తి మండలానికి చెందిన వ్యక్తిని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మేరట్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం అరెస్టు చేసి తీసుకెళ్లినట్లు కేయూ ఎస్సై బి.రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కోమటిపల్లికి చెందిన నమిండ్ల రాజ్‌కుమార్ తన భార్య ఖాతా పేరుతో క్రిప్టో కరెన్సీ పేరుతో ఉన్న సంస్థలో ఏజెంట్‌గా చేరాడు. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ఫోన్ చేసి క్రిప్టో కరెన్సీ పేరుతో రూ.కోటిన్నరకు పైగా డిపాజిట్ చేయించారు. దానికి గాను అతనికి కమీషన్ రూపంలో ఇప్పటి వరకు రూ.8 లక్షలకు పైగా వచ్చింది. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు మోసపోయినట్లు మేరట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన అక్కడి పోలీసులు కోమటిపల్లికి చెందిన నమిండ్ల రాజ్‌కుమార్‌ను నిందితుడిగా గుర్తించి, ప్రత్యేక వాహనంలో వచ్చి అదుపులోకి తీసుకొని వెళ్లారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు


అవార్డులు పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో నాయిని రాజేందర్‌రెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

భీమారం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. భీమారంలోని ఎస్వీఎస్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో రోటరీ క్లబ్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు గురువారం జాతి నిర్మాతలు బిరుదుతో అవార్డుల ప్రదానం చేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఎస్వీఎస్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ శరత్‌బాబు, కార్యదర్శి ప్రవీణ్‌రావు, కోశాధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భవిష్యనిధిపై అవగాహన సదస్సులు

కాజీపేట, న్యూస్‌టుడే: భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని జిల్లా కేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు, గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ ప్రాంతీయ కమిషనర్ ఎస్.దాసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రిలో, హనుమకొండ రాంపూర్‌లోని తిరుమల హేచరీస్‌లో, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటీ, జనగామ సెయింట్ మేరీస్ హైస్కూల్, జయశంకర్ భూపాలపల్లి ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యనిధి ఖాతాదారులు, ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించుకుని వెంటనే పరిష్కారం పొందవచ్చని సూచించారు.

డిగ్రీ పరీక్ష రుసుం గడువు అక్టోబర్ 5

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో నవంబరులో జరగనున్న డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ (రెగ్యులర్, బ్యాక్ లాగ్) సెమిస్టర్ పరీక్ష రుసుం నోటిఫికేషన్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహాచారి, అదనపు అధికారి తిరుమలదేవి గురువారం విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 5 వరకు, అపరాధ రుసుం రూ.50తో 15 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.kakatiya.ac.in లో చూడాలని సూచించారు.

నేటి నుంచి డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి అక్టోబర్ 5 వరకు హనుమకొండలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతుందని డీఈవో డి.వాసంతి గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 274 మంది అభ్యర్థులు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన వారు తమ ధ్రువపత్రాల జిరాక్స్‌తో హాజరుకావాలని సూచించారు. కాంట్రాక్టు పద్ధతిలో వారిని ఉపాధ్యాయులుగా నియమించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాల కోసం స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

నాణ్యత లేని రహదారి పనులపై ధర్నా


జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి పనులు నాసిరకంగా చేస్తున్నారని, కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. పనులు పూర్తికాకముందే గుంతలు పడుతున్నాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు రవీందర్, ఎల్లేశ్, రాములు, లక్ష్మణ్, కరుణాకర్, లింగారెడ్డి, తిరుపతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

టీటీసీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా స్టాలిన్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ టీచర్స్ క్రికెట్ అసోసియేషన్ (టీటీసీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా స్టాలిన్‌బేగ్, ప్రధాన కార్యదర్శిగా జయకృష్ణారెడ్డిలను ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు శర్మన్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమదేవరపల్లి మండలం ములుకనూర్‌కు చెందిన స్టాలిన్‌బేగ్ కొత్తకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ఈ నెల 28 వరకు కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్ కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్కతుర్తి సీఐ రమేష్ తెలిపారు. సివిల్ పంచాయతీలు, తగాదాలు, పాత కక్షల కేసులు ఉంటే ఇరుపక్షాలు రాజీ పడితే కేసు కొట్టివేస్తారని పేర్కొన్నారు.

రాష్ట్ర ఉత్తమ విత్తనోత్పత్తి రైతుగా శ్యాంసుందర్‌రావు


సన్మానిస్తున్న మంత్రి

భీమదేవరపల్లి: మండలంలోని ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం సభ్యుడు గుజ్జ శ్యాంసుందర్‌రావును ఉత్తమ విత్తనోత్పత్తి రైతు అవార్డు అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని సీడ్‌మెన్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆయన్ను సన్మానించారు. ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన శ్యాంసుందర్‌రావు సహకార సంఘం విత్తనోత్పత్తి విత్తనాలు సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధించారు.

బకాయి ఉపకారవేతనాలు విడుదల చేయాలి

సుబేదారి, న్యూస్‌టుడే: బకాయి ఉపకారవేతనాలు వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడారు. నాయకులు రాజేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ అధ్యయనంపై కమిటీ నివేదిక

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)పై అధ్యయన కమిటీ నివేదిక రూపొందించింది. గురువారం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కమిటీ సభ్యులు దాన్ని అందించారు. కేయూలో ప్రస్తుతం కాంట్రిబ్యూటరీ పింఛను పథకం (సీపీఎస్) అమలులో ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగులు జాతీయ పింఛను పథకానికి మారడానికి సంబంధించిన విధి విధానాలు, లోటుపాట్లు అధ్యయనం చేయటానికి కామర్స్ విభాగ ఆచార్యులు కె.రాజేందర్ ఛైర్మన్‌గా ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారు. వారు దీనిపై అధ్యయనం చేసి దాని వల్ల కలిగే ప్రయోజనాలపై నివేదిక తయారు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, ఇస్తారి, నాగరాజు, రాజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థుల హెరిటేజ్ వాక్

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల యువ టూరిజం క్లబ్ విద్యార్థులు, క్లబ్ కో ఆర్డినేటర్ వలస పైడి నేతృత్వంలో విద్యార్థులు చారిత్ర వేయిస్తంభాల దేవాలయంలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమానికి పర్యాటక శాఖ అధికారి శివాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు హాజరయ్యారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఏర్పాటు చేయాలి

నయీంనగర్, న్యూస్‌టుడే: ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం హనుమకొండలో ఏర్పాటు చేయాలని తెలంగాణ పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డా.చందా మల్లయ్య గురువారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో అటవీ శాఖ కార్యాలయం నుంచి నక్కలగుట్ట వరకు ఎద్దైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు ఆచార్య రామస్వామి, వేణు పాల్గొన్నారు.

కుక్కలకు క్రమం తప్పక వ్యాక్సిన్ ఇప్పించాలి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు ఇప్పించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటనారాయణ సూచించారు. ప్రపంచ ర్యాబీస్ నివారణ దినోత్సవం సందర్భంగా ధర్మసాగర్ బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ భూమయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వర్, ఏడీలు డాక్టర్ శ్రీనివాస్, వినయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

ముచ్చర్ల(భీమారం), న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని మహాత్మా జ్యోతిరావు పులే బాలికల గురుకుల పాఠశాలను జడ్పీ సీఈవో విద్యాలత గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీను, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి పాల్గొన్నారు.

అర్హత ఉన్న ఖాతాదారులకు రూపే కార్డులు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : అర్హత ఉన్న ఖాతాదారులకు రూపే కార్డులు అందజేయాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి ఖాతాదారునికి బీమా వర్తింపజేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది బ్యాంకుల ద్వారా ప్రాధాన్యత రంగాలకు రూ.5,333 కోట్ల రుణాలు అందజేసి, 120 శాతం లక్ష్యాన్ని చేరుకోవడం అభినందనీయమన్నారు. నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బేకరీ ఉత్పత్తుల సామగ్రి పట్టివేత


స్వాధీనం చేసుకున్న సరకులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: బేకరీ ఉత్పత్తుల కోసం వాడే సామగ్రి నాసిరకం, కల్తీవి విక్రయిస్తున్న దుకాణాలపై గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ. మధుసూదన్ కథనం మేరకు.. వరంగల్ మండిబజార్‌లో సంతోష్ కిరాణం, జనరల్ స్టోర్‌లో కల్తీ, కాలం చెల్లిన సామగ్రి బేకరీలకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో నిఘా ఉంచి గురువారం ఇంతేజార్‌గంజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సుమారు రూ.8 లక్షల విలువ చేసే 196 రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో బేకరీల్లో ఉపయోగించి పైనాపిల్, మ్యాంగో, ఆపిల్ పండ్ల క్రష్, చిల్లి, టామాటో సాస్, స్పైసి కోసం వాడే సామగ్రి ఉన్నాయి. నకిలీ బ్రాండ్లతో బేకరీలకు విక్రయిస్తున్నారు. దుకాణం యజమాని సంతోష్‌ను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు విచారణ కోసం ఆహార భద్రత అధికారి సమక్షంలో ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రంజిత్‌కుమార్, ఎస్సైలు శరత్, ఇంతేజార్‌గంజ్ ఎస్సై వెంకన్న, ఫుడ్‌సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య


గొల్లేన అశోక్ (పాతచిత్రం)

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ములుకనూర్‌కు చెందిన ఒకరు జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు ములుకనూర్ ఎస్ఐ సాయిబాబు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములుకనూరులోని వడ్డెర కాలనీకి చెందిన గొల్లేన అశోక్ (30) పన్నెండేళ్ల కిందట కరీంనగర్ జిల్లా చింతలపల్లికి చెందిన అనూషతో వివాహం అయింది. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అశోక్ మద్యానికి బానిసై భార్యతో గొడవ పడేవాడు. ఎన్నిసార్లు చెప్పిన మద్యం మానకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఒంటరి అయిన అశోక్ నిత్యం మద్యం మత్తులో ఉంటూ జీవితంపై విరక్తి చెందాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు అతడి భార్య అనూష ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఓ దొంగతనం కేసులో అశోక్‌ను హసన్‌పర్తి పోలీసులు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి, వేధించడంతోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని తల్లి ఐలమ్మ ఆరోపించడం గమనార్హం.

పరకాల నియోజకవర్గం

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని ర్యాలీ

పరకాల, న్యూస్‌టుడే: తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని ఆర్యవైశ్యులు డిమాండ్ చేశారు. గురువారం పరకాలలో అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. మండల ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యంపై ఫిర్యాదు

పరకాల: రెవెన్యూకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల జారీలో తహసీల్దార్ కార్యాలయంలో జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. గురువారం ఆర్డీవో కె.నారాయణను కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు హేమంత్, సాయితేజ, యశ్వంత్, అన్వేష్, అఖిల్, రాకేష్ పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



దామెర, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన జాతీయ రహదారిపై దామెర మండలంలో చోటుచేసుకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండ నుంచి పరకాలకు వెళ్తోంది. ఒగ్లాపూర్ ఎస్సారెస్పీ కాల్వ వంతెన వద్ద డ్రైవర్ బస్సు వేగం తగ్గించారు. దీంతో వెనకాలే కాళేశ్వరం నుంచి హనుమకొండకు వెళ్తున్న భూపాలపల్లి డిపో బస్సును డ్రైవర్ నియంత్రించలేక అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కించారు. ప్రయాణికులకు ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ప్రయాణికులను వేరే బస్సుల్లో పరకాలకు పంపించారు. దామెర ఎస్సై అశోక్ ఘటనాస్థలానికి చేరుకుని వివరాల సేకరించారు.

పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్‌కు సిఫార్సు

శాయంపేట: శాయంపేట వ్యవసాయ పరపతి సహకార సంఘం (పీఏసీఎస్) సీఈవో రాజమోహన్ సస్పెన్షన్‌కు సిఫార్సు చేసినట్లు డీసీవో నీరజ తెలిపారు. సంఘానికి సంబంధించి పేరుకుపోయిన ఇన్‌బ్యాలెన్స్‌లలో కొంత మొత్తాన్ని రైతులకు వడ్డీ రూపకంగా సర్దుబాటు చేశారని తెలిపారు. అయితే ఐదేళ్ల కాలం నుంచి సర్దుబాటు చేసుకురావాల్సింది పోయి ఒకేసారి చేయడంతో సమస్య తలెత్తిందన్నారు. ఉన్నతాధికారులకు ఎలాంటి సమచారం ఇవ్వకపోగా, పాలకవర్గం తీర్మానం లేకపోవడంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మండలం తిరుమలగిరికి చెందిన బూర రామనాథం సంఘంలో రుణం తీసుకోకపోయినప్పటికి పొందినట్లుగా ఉండటం, ఈ పేరుతో ఉన్న మరో రైతు ఖాతాకు ఇతని ఆధార్ జత చేయడం వల్ల సమస్య తలెత్తిందన్నారు. సీఈవో సస్పెన్షన్‌కు పాలకవర్గం తీర్మానం చేయాల్సిందిగా సిఫారు లేఖను పంపినట్లు ఆమె పేర్కొన్నారు.

అన్నదానం, పండ్ల పంపిణీ

పరకాల: పరకాలకు చెందిన దివంగత కోడూరి మల్లేశం 4వ వర్ధంతి సందర్భంగా గురువారం పరకాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొచ్చు భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదానం, పండ్లు, బ్రెడ్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమాలు నిర్వహించారు. మల్లేశం చిత్రపటానికి డాక్టర్ బాశెట్టి అభిరామ్ పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారుడు..


కడార్ల రామాచారి(పాత చిత్రం)

పరకాల, న్యూస్‌టుడే: పరకాలకు చెందిన ఓ స్వర్ణకారుడు ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... కడార్ల రామాచారి(52) స్థానికంగా ఆభరణాల తయారీతో ఉపాధి పొందుతున్నారు. కొద్ది కాలం నుంచి పనులు లేక ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నాయి. బుధవారం రాత్రి భార్య దుకాణం వద్దకు వెళ్లగా.. ఇక్కడే పడుకుంటానని చెప్పారు. గురువారం ఉదయం దుకాణం తెరవకపోవడంతో అనుమానం వచ్చి ఇంట్లో అదనంగా ఉన్న తాళాలను తీసుకొచ్చి షట్టర్‌ను తెరవగా రామాచారి ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నారు. మృతుడి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విష పురుగు కాటుతో వృద్ధుడి మృతి

కమలాపూర్, న్యూస్‌టుడే: విష పురుగు కుట్టడంతో ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన చేపూరి కనకమల్లు (70) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. కమలాపూర్‌లోని ఓ రైస్‌మిల్లులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కనకమల్లు బుధవారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా విష పురుగు కుట్టడంతో మిల్లు సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అనంతరం కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి అనంతరం మృతి చెందారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.